సాక్షి శ్రీకాకుళం

బుధవారం ၊ 17 ၊ సెప్టెంబర్ ၊ 2025



కర్షకులకు కరెంటు కష్టాలు

కర్షకులను కరెంటు కష్టాలు వేధిస్తున్నాయి. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు 50 కనెక్షన్లు ఉన్నాయి. - 8లో



సరికొత్తగా సైన్స్ ఎగ్జిబిషన్

జిల్లా కేంద్రంలో సైన్స్ ఎగ్జిబిషన్ జరగనుంది. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ వేదిక కానుంది. - 8లో

జాబులిప్పిస్తామని మోసం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా వైద్యారోగ్యశాఖలో జాబులిప్పిస్తామని నమ్మించి రూ.8 లక్షలకు టోకరా వేసిన భార్యాభర్తలపై మంగళవారం ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం. హరికృష్ణ తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. 2022 ఫిబ్రవరిలో అదే శాఖలో పని చేస్తున్న అప్పటి హెల్త్ అసిస్టెంట్ జీవీ నరసింహం అనే వ్యక్తి తురకల సురేష్, ఆయన భార్య, మరో మహిళ రాంబాయికి తప్పుడు జాయినింగ్ రిపోర్టులు ఇచ్చి మోసం చేశాడు. దీనిపై ఇటీవల సురేష్ ఫిర్యాదు చేయడంతో నరసింహం, అతనికి సహకరించిన భార్యలిద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

'ప్రైవేటుపరం చేయడమే అభివృద్ధా..?'



మాట్లాడుతున్న మాజీ మంత్రి సీదిరి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని అందించాలనే సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకువస్తే వాటిని ప్రైవేటుపరం చేయడం అన్యాయమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ వింగ్ అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శ్రీకాకుళంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 1923 వైజాగ్ ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటు మొదలుకుని 2024 పాడేరులో మెడికల్ కాలేజీ నిర్మాణం వరకు ఒక్క సీటు, ఒక్క కాలేజీని కూడా చంద్రబాబు తీసుకురాలేదని గుర్తు చేశారు. కాన్నీ అన్నీ తానే తెచ్చినట్లు భజన బృందం చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పీపీపీ మోడ్ అంటే ప్రభుత్వ ఆస్తుల్ని అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడమేనని వివరించారు. చంద్రబాబుకు ప్రతిదాన్ని ప్రైవేటుకు అప్పగించేయాలన్న ఆలోచన తప్ప ప్రజలకు మంచిచేసే ఆలోచన లేదని దుయ్యబట్టారు. ఇన్ని జరుగుతున్నా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మౌనంగా ఉండిపోవడం తగదన్నారు. ఈ 15 నెలల్లో రాష్ట్రంలో ఉల్లి, టమాటా, మామిడి, పొగాకు రైతులు రోడ్డున పడ్డారన్నారు. పోర్టులు, స్కూల్స్‌ని పూర్తి చేయాలన్న మనసు లేని మనుషులు కూటమి నేతలని మండిపడ్డారు. ఇదే మాదిరిగా పాలన సాగిస్తే వైఎస్సార్‌సీపీ ఎలాంటి పోరాటాలకైనా వెనకడుగు వేయదని అన్నారు.

నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విజిలెన్స్ ఆరా

అరసవల్లి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కీలకమైన డెమో విభాగంపై విజిలెన్స్ దృష్టి సారించింది. మంగళవారం సాక్షిలో ప్రచురితమైన 'తినేస్తున్నాడెమో' అన్న కథనంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. ప్రచార విభాగానికి సంబంధించి ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. తాజా పరిణామాలతో వైద్య ఆరోగ్యశాఖలో డెమో విభాగ అధికారులతో పాటు కీలక అధికారి కూడా అప్రమత్తమయ్యారని తెలుస్తోంది. విజిలెన్స్ రంగ ప్రవేశం అనంతరం నిధులు బుక్కేసినవారిపై ఉద్యోగుల్లో సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. స్వాతంత్ర్య దినోత్సవ శకటం, పలు దినోత్సవాలు, వారోత్సవాల ప్రచార ఫైల్స్‌లో మార్పులు, చేర్పులు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అందరి సహకారంతో కొత్తమ్మ తల్లి శతాబ్ది ఉత్సవాలు



కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి: అందరి సహకారంతో కొత్తమ్మ తల్లి శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి కోరారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు, ప్రత్యేకంగా హెలీ రైడ్, కొత్తమ్మతల్లి విశిష్టత పై లేజర్ షోతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 24న కొత్తపేట జంక్షన్ నుంచి శోభయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. వారణాశిలో హారతి ఇచ్చే విధంగా అమ్మవారికి హారతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోలేదని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు, వేతన సవరణలు, కరువు భత్యం మంజూరు జరగడం లేదన్నారు. డీఏ, పీఆర్‌సీ పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


అణచివేత సరికాదు



కూటమి ప్రభుత్వం చేసే అక్రమాలు, అన్యాయాల్ని ప్రజలకు తెలియజేస్తే వారిపై కేసులు బనాయించి జర్నలిజాన్ని అణచివేసే ప్రయత్నం సరికాదు. పత్రికల గొంతు నొక్కేయాలని అనుకోవడం అప్రజాస్వామికం. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే వారిని వదలకూడదు. **- కేవీజీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



హేయమైన చర్య



సాక్షి పత్రిక ఎడిటర్, పలువురు జర్నలిస్టులపై టీడీపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు హేయం. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే. కేసుల పేరుతో విచారణకు పిలిపించి గంటల తరబడి ఉంచడం సరికాదు.

- మామిడి శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు

పక్కా చీటింగ్



తలసముద్రం గ్రామంలో రోడ్డుపై యూరియా బస్తాను ఇద్దరు రైతులు చెరి సగం పంచుకుంటున్న దృశ్యమిది. యూరియా కొరత వల్ల ఇద్దరికి ఒక బస్తా ఇవ్వడంతో ఇలా పంచుకున్నారు. కొందరు మాత్రం వీఏఏలపై ఒత్తిడి తెచ్చి యూరియా తీసుకెళ్లిపోతున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. -పోలాకి



పూండిలో ఓ ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం రైతుల అగచాట్లు ఇవి. దాదాపు పది కిలోమీటర్ల దూరం నుంచి రైతులు ఇక్కడకు మంగళవారం వచ్చారు. చీటీలు పట్టుకుని గంటల తరబడి నిలబడినా యూరియా దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. -వజ్రపుకొత్తూరు

జగన్ ఉన్నప్పుడు బాగానే ఇచ్చారు. సెక్రటరీలు తెచ్చేవారు. కార్డులు ఒట్టుకెళ్లి విడిపించుకునే వారిమి. ఇప్పుడు జనాల్ని తినేస్తున్నాడు బాబు. రోడ్డు పాలు చేస్తున్నాడు. అంబలి, గంజి లేకుండా చచ్చిపోతున్నాం. స్లిప్పులు తెమ్మంటున్నారు. స్లిప్పులు తేనిచ్చి.. లైన్లలో తోసేస్తున్నారు.

- ఓ మహిళా రైతు ఆవేదన ఇది

అసలే ఎరువులు తక్కువ. ఇస్తున్న చీటీలు ఎక్కువ. ఎంతమందికని ఇవ్వగలం. నాయకులు, డిపార్ట్‌మెంట్ ఒత్తిళ్లు ఉన్నాయి. వ్యాపారులం ఏం చేయగలం. ఎవరిని ఏం అనలేకపోతున్నాం.

- ప్రైవేటు ఎరువుల వ్యాపారి గోడు

మొన్నటి వరకు యూరియా కోసం ఒత్తిడి చేసేవారు. దాచి ఇవ్వాలని ఆదేశించేవారు. ఇవ్వకపోతే బెదిరించేవారు. మాట వినకపోతే కక్ష సాధించేవారు. ఇప్పుడేమో స్లిప్పుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. తమ వారికే స్లిప్పులు ఇవ్వాలని ఆదేశిస్తున్నారు. ఒక్కో స్లిప్పులో చెప్పినన్ని బస్తాలు రాయాలని ఒత్తిళ్లు పడలేకపోతున్నాం.

- విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ల మనోవేదనిది

- తెలుగు తమ్ముళ్ల చేతికే యూరియా చీటీలు
- కొనసాగుతున్న మరో అధికారిక దోపిడీ
- వీఏఏలపై ఆగని ఒత్తిళ్లు
- తమ వాళ్లకే చీటీలు ఇవ్వాలని అధికార పార్టీ నాయకుల హుకుం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

యూరియా పంపిణీలో అధికారికంగానే 'చీటి'ంగ్ జరుగుతోంది. ఎరువుల కోసం ముందస్తుగా పంపిణీ చేస్తున్న చీటీలను తమ వారికే ఇచ్చేలా అధికార పార్టీ నాయకులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. వీరి ఒత్తిళ్లు పడలేక సచివాలయ సిబ్బంది వేదనకు గురవుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులందరికీ యూరియా దొరికేది. ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకుని దాని ప్రకారం ఎరువులు ఇచ్చేవారు. ఇప్పుడు ఈ-క్రాప్ జరగడం లేదు. సాగుపై ఎవరికీ కనీస అంచనా కూడా లేదు. దీంతో కూటమి ప్రభుత్వంలో యూరియా బస్తా దొరికితే చాలు అదే పదివేలు అన్న చందంగా పరిస్థితి మారింది.

ఆర్ఎస్‌కేల్లో, పీఏసీఎస్‌లలో అధికార పార్టీ నాయకులే యూరియా బస్తాలు పట్టుకుపోతున్నారని ఏకంగా విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లే(వీఏఏ) వాపోతున్నారు. ఉద్యోగులే రోడ్డెక్కడంతో కలెక్టర్ ఆధ్వర్యంలో కొత్తరకమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. రైతు సేవాకేంద్రాలు, ప్రైవేటు దుకాణాలకు వచ్చిన యూరియాను నేరుగా అమ్మకుండా తహసీల్దార్, వ్యవసాయ శాఖాధికారి సంయుక్తంగా సంతకాలు చేసిన చీటీలను పట్టుకెళితేనే యూరియా ఇవ్వాలని అటు రైతు సేవా కేంద్రాలకు, ఇటు డీలర్లకు ఆదేశాలు ఇచ్చారు. ఆ చీటీలను పంపిణీ చేసే బాధ్యత సచివాలయాల్లో వీఏఏలకు అప్పగించారు.

మళ్లీ అదే పరిస్థితి

విధానం మార్చినా పరిస్థితుల్లో మార్పు రాలేదు. ఈ చీటీలను తమవారికే ఇచ్చేలా టీడీపీ నాయకులు ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడి పెడుతున్నారు. నచ్చినంత యూరియా కావాలని రాయించుకుంటున్నారు. ముఖ్యంగా సాగు చేయని వారు, కౌలుకు ఇచ్చిన రైతుల పేర్లతో చీటీలను రాయించుకుంటున్నారు. అంతేకాకుండా ఒకే ఇంట్లో ఉన్న నలుగురైదుగురిపైన కూడా రాయించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీఏఏల దగ్గర చీటీలు రాయించుకోవడమే కాకుండా తమ వాళ్లు తీసుకొచ్చిన చీటీలకే ప్రాధాన్యత ఇవ్వాలని వ్యాపారులపై కూడా ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో సామాన్య రైతులకు యూరియా దొరకడం గగనమైపోయింది.

ఇరకాటంలో వ్యవసాయశాఖ సిబ్బంది..

అటు కూటమి నాయకుల ఒత్తిళ్లకు తట్టుకోలేక, ఇటు అన్నదాతల బాధలు చూడలేక వ్యవసాయశాఖ సిబ్బంది ఇరకాటంలో పడ్డారు. మనకెందుకులే అని కొంతమంది వీఏఏలు వచ్చినవారందరికీ సీట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రైవేటు వర్తకుల వద్ద చీటీలు ఎక్కువ, యూరియా తక్కువ అన్నట్లు ఉంది పరిస్థితి. అక్కడ కూడా మళ్లీ అధికార పార్టీ నాయకులే చీటీలు చూపించి యూరియాను కొట్టేస్తున్నారు.

చిలక్కొట్టుడు..

మే, జూన్, జూలై నెలల్లో ప్రైవేటు డీలర్ల దగ్గర యూరియా కొనుగోలు చేసిన రైతుల వివరాలు వీఏఏల వద్ద లేవు. దీంతో చాలా మంది మళ్లీ యూరియా కోసం వస్తున్నారు. దీనికి తోడు అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారం చీటీలను పట్టుకెళ్లిపోతున్నారు. ఈ చీటీలతో ప్రైవేటు డీలరు వద్ద ఎంఆర్‌పీ ధరకే యూరియా బస్తాలు కొట్టేసి బ్లాక్‌లో రూ.400, రూ.500అంతకంటే ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల గ్రామాల్లో దళారీలకు అప్పగించి బహిరంగంగానే అధిక ధరలకు యూరియా అమ్మకాలు చేపట్టిన సందర్భాలపై రైతులు అనేక ఆరోపణలు చేస్తున్నారు.

అంతా గోప్యమే..!

- డీఎస్సీ మెరిట్ కం రోస్టర్ జాబితాపై అభ్యంతరాలు
- తక్కువ మార్కులు వచ్చిన వారికి ఎగువ, ఎక్కువ మార్కులు వచ్చిన వారికి దిగువ స్థానాలు
- న్యాయం చేయాలని వేడుకుంటున్నా పట్టించుకోని వైనం



శ్రీకాకుళం: డీఎస్సీ.. అంటే డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ అని అర్థం. ఈ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా విద్యాశాఖ అధికారి ఉంటారు. వీరి నేతృత్వంలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ జరుగుతుంది. గతంలో ఆఫ్‌లైన్ విధానంలో డీఎస్సీ నిర్వహించేవారు. ఇప్పుడు దాన్ని ఆన్‌లైన్ విధానంలోకి మార్చి నిర్వహిస్తున్నారు. సాధారణంగా పరీక్ష నిర్వహించిన తర్వాత మార్కుల ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను రాష్ట్రస్థాయిలో విడుదల చేసి జిల్లాకు పంపిస్తారు. అటు తర్వాత జిల్లా స్థాయిలో మెరిట్ జాబితాను ప్రకటిస్తారు. ఇది పూర్తయిన తర్వాత రోస్టర్ పాయింట్ల ఆధారంగా మెరిట్ కం రోస్టర్ జాబితాను విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత తుది జాబితాను ప్రకటిస్తారు. అటు తర్వాత అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయిస్తారు.

కానీ కూటమి ప్రభుత్వం డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీకి బదులుగా స్టేట్ సెలక్షన్ కమిటీ విధానాన్ని అవలంబిస్తూ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఉపాధ్యాయ నియామక ప్రక్రియను రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తోంది. అక్కడ ఏం జరుగుతుందో జిల్లా విద్యాశాఖకు కూడా తెలియని పరిస్థితి. ఎందరో అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందని మొరపెట్టుకుంటున్నా తామేమీ చేయలేమని, రాష్ట్రస్థాయిలోనే సరిదిద్దుతారని చెబుతూ జిల్లా విద్యాశాఖ వర్గాలు చేతులెత్తేస్తున్నాయి. మార్కులు ప్రకటించిన నుంచి తుది జాబితా విడుదలైన వరకు ఒకరి మార్కులు ఒకరికి తెలియకుండా, ఎవరిని ఎంపిక చేశారో పక్క వారికి కూడా తెలియకుండా గోప్యంగా ప్రక్రియను నిర్వహిస్తుండడంతో పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తుది జాబితాలో ఎన్నో పొరపాట్లు

రాష్ట్రస్థాయిలో సోమవారం విడుదల చేసిన మెరిట్ కం రోస్టర్ జాబితాలో ఎన్నో పొరపాట్లు జరిగాయి. దీనికి సంబంధించి కొందరు అభ్యర్థులు కలెక్టర్‌కు, జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నా వాటిని రాష్ట్రస్థాయికి నివేదిస్తామని అక్కడ సరిచేస్తారని చెబుతూ వస్తున్నారు. అభ్యర్థులు రాష్ట్రస్థాయికి తెలియజేసేందుకు హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ అది ఎప్పుడు పని చేస్తుందో తెలియని పరిస్థితి. ఒక వేళ పనిచేసినా సమస్యను నివేదించాక అధికారుల దృష్టికి తీసుకువెళతామని మాత్రమే చెబుతున్నారు తప్ప సమస్య పరిష్కారమైనట్లు ఎలాంటి సమాచారం ఉండటం లేదు. దీంతో అభ్యర్థులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ఎవరు పట్టించుకుంటారు..?

సాంఘిక శాస్త్ర విభాగంలో బిర్లంగి శ్రీదేవి అనే అభ్యర్థి 77.51 మార్కులను, అంపోలు పుణ్యవతి అనే అభ్యర్థి 75.6 మార్కులను, మెట్ట శారద అనే అభ్యర్థి 73.3 మార్కులను సాధించారు. వీరు ముగ్గురూ బీసీ ఏ కేటగిరీకి చెందిన వారు. మార్కుల ఆధారంగా చూసుకుంటే శ్రీదేవి ముందుగాను, పుణ్యవతి, శారదలు అటు తర్వాత వరుస క్రమంలోనూ ఉండాల్సి ఉంది. అయితే విడుదలైన జాబితాలో శ్రీదేవి 51వ స్థానంలోనూ, పుణ్యవతి 46వ స్థానంలోనూ, ఉండగా శారద 20వ స్థానంలో ఉన్నారు. శ్రీదేవి గడిచిన రెండు రోజులుగా కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం చేసే వారే కరవయ్యారు. అభ్యర్థులను త్వరలోనే అమరావతికి తీసుకువెళ్లి అక్కడ నియామక పత్రాలు ఇస్తారని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన అందరినీ ఒక చోటకు చేర్చి నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు చెబుతుండగా, జిల్లా స్థాయిలో తప్పును సరిదిద్దకుండా రాష్ట్రస్థాయిలో ఇన్ని వేలమంది హాజరయ్యే సమయంలో తమకు న్యాయం జరగదని శ్రీదేవి ఆందోళనకు గురవుతున్నారు. తనకు ఎక్కువ మార్కులు వచ్చినా వెనుకకు నెట్టడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుందేమోనని బెంగపడుతున్నారు. తమకు న్యాయం చేయాలని కనిపించిన ప్రతి అధికారిని డీఎస్సీ కమిటీలోని సభ్యులందరినీ వేడుకుంటున్నారు.

నిలిచిన సీటీ స్కాన్ సేవలు

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో రెండు రోజులుగా సీటీ స్కాన్ సేవలు నిలిచిపోయాయి. సీటీ స్కాన్ విభాగానికి సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో సేవలు నిలిపివేసినట్లు అక్కడి సిబ్బంది తెలిపారని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి సీటీ సేవల కోసం వచ్చిన వారు నిరాశగా మళ్లీ శ్రీకాకుళం వరకు వెళ్లాల్సి వస్తోంది.



ఖాళీగా ఉన్న సీటీ స్కాన్ విభాగం

ధరిత్రికి రక్ష.. O_3



ఓజోన్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో ఓజోన్ పొర విశిష్టతను వివరించారు. కొత్తూరు మండలం కుంటిభద్ర గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇలా ఓ-3 ఆకారంలో కూర్చుని ఓజోన్ ప్రాధాన్యతను చెప్పారు. - కొత్తూరు

నిరసనలకు దిగిన విద్యుత్ ఉద్యోగులు


అరసవల్లి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ న్యాయమైన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల ఉద్యోగ కార్మికులు దశలవారీగా ఆందోళనలకు దిగుతున్నారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి విధులను నిర్వర్తించగా, షెడ్యూల్ ప్రకారం ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లా కేంద్రంలో సర్కిల్ కార్యాలయం వద్ద భోజన విరామ సమలో ధర్నా నిర్వహించేలా సన్నద్ధమవుతున్నారు. అలాగే ఈ నెల 19,20 తేదీల్లో సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలకు దిగనున్నారు. అనంతరం ఈనెల 22న జిల్లా కేంద్రంలో శాంతియుత ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌కు వినతిపత్రాన్ని ఇవ్వడంతో దశలవారీ ఆందోళనలను విరమించనున్నారు. అప్పటికీ సమస్యల పరిష్కారం కాకపోతే తదుపరి కార్యాచరణ చేపట్టనున్నట్లుగా జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన నోటీసును సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తికి జేఏసీ చైర్మన్ మహంతి ప్రభాకరరావు, కన్వీనర్ జి.రమేష్‌కుమార్, ముఖ్య సభ్యులు పీవీఏ నాయుడు, ఎం.శ్రీనివాసరావు, పీవీ రమణ, బీవీ గురునాథరావు, పి.ఉమాశంకర్, టీవీ సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.



ఎస్ఈ కృష్ణమూర్తికి నోటీసు కాపీని అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

'సిమ్'పుల్‌గా కొట్టేస్తున్నారు

- వణికిస్తున్న ఈ-సిమ్ స్కామ్
- జిల్లాలో పెరుగుతున్న బాధితుల సంఖ్య



సోంపేటలోని ఓ బ్యాంకు మేనేజర్ ఫోన్ సడెన్‌గా పనిచేయడం మానేసింది. నెట్‌వర్క్ సిగ్నల్ ఫెయిల్ అని చూపించింది. అక్కడకు కొద్ది గంటల్లోనే తన ఖాతాలో ఉన్న సొమ్ము మాయమైంది. ఐదు రోజుల్లో దాదాపు రూ. 22 లక్షల వరకు మాయమయ్యాయి.

కాశీబుగ్గలో సైతం ఓ బ్యాంకు మేనేజరే తన ఫోన్‌కొచ్చిన లింక్ క్లిక్ చేశారు. అక్కడికి ఒక రోజు ఆగాక తన సిమ్ బ్లాక్ అయ్యింది. సిమ్ కంపెనీ నెట్‌వర్క్ ప్రొవైడర్ వద్దకు వెళ్తే ఎం-ఆధార్‌లో ఆయన బయోమెట్రిక్ లాక్ అయ్యిందని తెలిసింది. వారం రోజుల్లో దాదాపు రూ.14 లక్షల సొమ్ము పోయింది.

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలో కొత్త తరహా స్కామ్ వెలుగు చూస్తోంది. 'ఈ-సిమ్' స్కామ్‌పై కొద్ది రోజుల్లోనే జిల్లాలో 15కుపైగా కేసులు నమోదయ్యాయి. వీరిలో కొందరు పోలీసులను ఆశ్రయిస్తుండగా..మరికొందరు భయపడి మిన్నకుండిపోతున్నారు. మోసపోయిన అందరి సిబిల్ స్కోర్ బాగుండటం విశేషం.



అసలు ఏంటీ ఈ-సిమ్..?

- ఈ-సిమ్.. అంటే ఎలక్ట్రానిక్ సిమ్. ఫీచర్లు ఎక్కువ ఉండే ఐఫోన్ ఇతరత్రా ఫోన్లలో ఈ-సిమ్‌లనే వాడుతారు.
- మన ఫోన్‌లో ఉండే సాధారణ సిమ్‌ల స్థానంలోనే ఈ-సిమ్ యాక్టివేషన్ అంటూ వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఇతర మాధ్యమాల ద్వారా నేరస్తులు ఓ లింక్ పంపుతారు.
- ఆ లింక్ క్లిక్ చేసిన వెంటనే సైబర్ నేరస్తుల మెయిల్ ఐడీకి మన సిమ్ నంబర్ లింక్ అవుతుంది. ఓటీపీ వస్తుంది చెప్పండంటూ తక్షణమే వారి నుంచి ఫోన్ వస్తుంది.
- ఓటీపీ చెప్పిన వెంటనే మన ఫోన్‌లో ఉన్న ఫిజికల్ సిమ్ వారి ఫోన్‌లో ఉండే ఈ-సిమ్ నంబర్‌గా యాక్టివేట్ అయిపోతుంది. కొన్నిసార్లు ఓటీపీ అవసరం లేకుండానే ఇదంతా జరుగుతుంది.
- ఈ-సిమ్‌గా యాక్టివేట్ అయ్యాక మన వద్ద ఉండే సిమ్ నెట్‌వర్క్ ఆగిపోతుంది. ఫోన్ నంబర్‌తో లింక్ అయ్యే ఆధార్ కార్డు ఉంటుంది కాబట్టి ఎం.ఆధార్ యాప్‌లోకి వెళ్లి ఓటీపీల ద్వారా బయోమెట్రిక్ లాగిన్ ఓపెన్ చేసి మన ఆధార్ నంబర్‌ను లాక్ చేసేస్తారు.

సమాచారమంతా వారి గుప్పిట్లోకే..

ఒక్కసారి ఈ-సిమ్ యాక్టివేట్ అయితే సమాచారం అంతా వారి గుప్పిట్లోకి వెళ్లిపోతుంది. బ్యాంకు లావాదేవీల ఓటీపీలన్నీ వారికే వెళ్తాయి. వారికి ఇక పాస్‌వర్డులు, ఏటీఎం కార్డు వివరాల అవసరం ఉండదు. సులభంగా బాధితుల ఖాతాల నుంచి సొమ్మును లాగేస్తారు. మోసం గ్రహించి నెట్‌వర్క్ ప్రొవైడర్ వద్దకు వెళ్తే వారం రోజులకు గానీ పని అవ్వదు. ఈలోగా ఖాతా ఖాళీ చేసేస్తారు.

అప్రమత్తంగా ఉండాల్సిందే..



నెట్‌వర్క్ ప్రొవైడర్ అంటూ వచ్చే ఫేక్ మెసేజ్‌లు, ఏపీకే లింక్‌లు ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయకండి. కంపెనీలు ఇలాంటివి పంపవని గ్రహించాలి. హఠాత్తుగా మన సిమ్ నెట్‌వర్క్ ఆగిపోతే స్కామ్ అని అనుమానించాల్సిందే. వెంటనే సమీపంలో ఉండే మీ అకౌంట్లున్న బ్యాంకును సంప్రదించి గానీ బ్యాంక్ కస్టమర్‌కేర్‌లో గానీ సమస్య నివేదించి అన్నీ ఫ్రీజ్ చేయించాలి. సిమ్ నెట్‌వర్క్ కంపెనీని కూడా సంప్రదించాలి.

- సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

అందుబాటులో న్యాయసేవలు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలని, అందుకు పారాలీగల్ వలంటీర్లు క్షేత్ర స్థాయిలో అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ద్వారా పేదలు, కొన్ని వర్గాల వారు ఉచిత న్యాయసేవలు పొందవచ్చని చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ సేవా సదన్‌లో పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్య సమస్య పట్టించుకోరా?


రోడ్డుపై బైఠాయించిన అందవరం గ్రామస్తులు

జలుమూరు: పారిశుద్ధ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం అందవరం గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. అందవరం, రామకృష్ణాపురం, గొల్లపేట గ్రామాల్లో రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దోమలు వ్యాప్తి చెంది అంటు రోగాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్లు కూడా వెలగడం లేదని, ఇసుక లారీల వల్ల రోడ్డు గోతులమయంగా మారిందని వాపోయారు. విషయం తెలుసుకున్న పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు గ్రామస్తులతో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు


గంజాయి నిందితులతో పోలీసులు

పలాస: ఒడిశా రాష్ట్రం జగిదిపదర్ గ్రామానికి చెందిన హేమంత్ సబర్, కేశబ్‌సబర్‌లు పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో మంగళవారం అనుమానాస్పదంగా తిరగడంతో పట్టుకొని తనిఖీ చేయగా గంజాయి బయటపడిందని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. మూడు ప్యాకెట్లలో ఉన్న 16.845 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. నిందితులను పలాస కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. ఒడిశా రాష్ట్రం రాజ్‌బోసా గ్రామానికి చెందిన అముస్ అలియాస్ జూన్‌హేన్సన్ వద్ద గంజాయి తీసుకుని కర్ణాటక రాష్ట్రానికి చెందిన సంజురైతో అనే వ్యక్తికి ఇచ్చేందుకు వీరు వెళ్తున్నట్లు గుర్తించామన్నారు. పలాస రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి సిబ్బందితో కలిసి పట్టుకున్నారని సీఐ చెప్పారు. గంజాయితో పాటు సెల్‌ఫోన్, రూ.3,650 నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

24న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా డోకులపాడులో ఈ నెల 24న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులని, ఈ నెల 22లోగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9550190937 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కర్షకులకు కరెంట్ కష్టాలు

- వేధిస్తున్న విద్యుత్ సమస్య
- ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు 50 పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
- హెచ్చుతగ్గులతో కాలిపోతున్న మోటార్లు


కవిటి మండలం పుటియాదళలో 51 విద్యుత్ కనెక్షన్లు కలిగి ఉన్న 100 కె.వి.ట్రాన్స్‌ఫార్మర్

కవిటి : వ్యవసాయం, రైతుల సంక్షేమమే తమ ధ్యేయమంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతనకుదరడం లేదు. ఇప్పటికే యూరియా, ఎరువులు పూర్తిస్థాయిలో అందక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలకు కరెంట్ కష్టాలు సైతం వెంటాడుతున్నాయి. ఉద్దాన ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ బోరు బావులపైనే ఆధారపడి సాగు జరుగుతోంది. కవిటి మండలం పుటియాదళ రెవెన్యూ గ్రామాల్లో రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు పెద్దసమస్యగా మారాయి. ఇక్కడ 276 ఎకరాలు వరిసాగు విస్తీర్ణం ఉంది. ఈ ఏడాది నెలకొన్న ప్రత్యేక పరిస్థితులలో దమ్ముల సీజన్‌లో మినహాయించి వరినాట్లు వేశాక సరైన వర్షం లేక అన్నదాత బోరుమంటున్నారు. ఇలాంటి సమయంలో అండగా నిలవాల్సిన ఉచిత విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లు మొరాయిస్తున్నాయి. మోటార్లు తిరగడం లేదు. దీనికి కారణం ఏంటని ఆరా తీస్తే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై 51 వరకు కనెక్షన్లు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. దీనివల్ల ఇటీవల 8 మోటార్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కీలక దశలో..

వరిపైరు పొట్టదశకు చేరుకునే క్రమంలో నీరు తప్పక అందాల్సి ఉంది. ఈ సమయంలో మోటార్లు తిరగక రైతుల ఆందోళన చెందుతున్నారు. దీనికి తక్షణ పరిష్కారంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వాస్తవానికి ఇక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పట్టించుకోకుండా ఇన్ని కనెక్షన్లు ఎందుకు ఇచ్చారంటే ఉద్యోగులు సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి దృష్టి సారించాలని, లేనిపక్షంలో 250 ఎకరాల్లో వరిపంటకు నష్టం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోటార్లు తిరగడం లేదు..



ఏడాదికి ఒకే పంట పండిస్తున్నాం. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ విద్యుత్‌మోటార్లు మాకు శ్రీరామరక్ష అనే భావనతో ఉండేవాళ్లం. కానీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పరిమితికి మించి కనెక్షన్లు ఉండటంతో అసాధారణంగా లోడ్ పెరిగింది. మోటార్లు తిరగడం లేదు. తక్షణం విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి రైతుల్ని ఆదుకోవాలి.

– బెందాళం వెంకటేశ్వరరావు, రైతు, కవిటి

కాలిపోతున్నాయి..



పుటియాదళలో ఎకరా పైగా వరిపొలం ఉంది. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా లేక విద్యుత్ మోటార్లపైనే ఆధారపడుతున్నాం. మా ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఈ సీజన్‌లో 8 మోటార్లు కాలిపోయాయి. ఎప్పుడు ఎవరి మోటార్ కాలిపోతోందో అనే భయం వెంటాడుతోంది. తక్షణమే లోడ్‌ను తగ్గించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించే చర్యలు తీసుకోవాలి.

– బి.జయరాం, రైతు, రామయ్యపుట్టుగ

సరికొత్తగా సైన్స్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌కు ఆతిథ్యమిస్తున్న ఆర్ట్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం

- వేదికగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల
- అప్లైడ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహణ
- 60 శాస్త్రీయ సూత్రాల నమూనాల ప్రదర్శన

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఓ సరికొత్త సైన్స్ ఎగ్జిబిషన్‌కు వేదికగా మారింది. కళాశాలలోని సెంటర్ ఫర్ అప్లైడ్ సైన్స్, జంతుశాస్త్రం సంయుక్తంగా ఇండిజీనస్ సొసైటీ ఫర్ ఫ్రుగల్ సైన్స్ ఇన్వెన్షన్ (ఐఎస్ఎఫ్ఎస్ఐ) అప్‌స్కిల్ ప్రాక్టికల్ సొల్యూషన్స్ సహకారంతో 'సమాజంలో సైన్స్ వైబ్రేషన్స్' పేరిట రెండు రోజులపాటు ఆచరణాత్మక ధోరణి పద్ధతిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 17, 18 తేదీల్లో కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియం వేదికగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

60 శాస్త్రీయ సూత్రాలతో..

ఎగ్జిబిషన్‌లో సుమారు 60 శాస్త్రీయ సూత్రాలకు సంబంధించిన ప్రత్యక్ష నమూనాలు, వాస్తవ ప్రపంచ ఉదాహరణలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులు, అక్కడి టీచర్లు/లెక్చరర్లు సద్వినియోగం చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు పిలుపునిస్తున్నారు. ఇందులో పాల్గొంటే విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం డీఎస్‌టి ఇన్‌స్పైర్ పోటీలు, కెవీపీవై ఫెలోషిప్‌లు, ఎన్‌సీఈఆర్టీ ప్రయాస్ పథకాలకు ఎంపికకావడానికి దోహదపడుతుందని చెప్పారు. ఈ మేరకు బ్రోచర్‌ను ఆవిష్కరించి, వివరాలను నిర్వహణ కమిటీ ప్రతినిధులతో కలిసి వివరించారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కన్వీనర్, కో–ఆర్డినేటర్లు

నైపుణ్యాభివృద్ధికి దోహదం..

సైన్స్, టెక్నాలజీ రంగంలో ప్రస్తుతం వస్తున్న ఆవిష్కరణలు, వాటి ప్రాథమిక శాస్త్రీయ సూత్రాలపై పట్టు సాధించడమనేది ఆచరణాత్మక (ప్రాక్టికల్స్) నైపుణ్యం ద్వారానే సాధ్యపడుతుందని కాలేజ్ అప్లైడ్ సైన్సెస్ విభాగాధిపతి, సైన్స్ ఎగ్జిబిషన్ కన్వీనర్ డాక్టర్ మధమంచి ప్రదీప్ పేర్కొన్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఆర్.హరిత, డాక్టర్ వై.పోలినాయుడు, పి.సుధారాణి, ఎస్.రవిబాబు, కె.అపర్ణా మాట్లాడుతూ రెండురోజుల ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోయే ప్రాజెక్టులపై ప్రత్యేక పుస్తకం రూపొందిస్తామని, మూల్యాంకన పరీక్ష కూడా నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబర్చినవారికి ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామన్నారు. ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నవారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందిస్తామని, వివరాలకు సెల్: 8555911961, 7702203953, 6301096643 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

దళిత కార్మికుల పొట్ట కొట్టొద్దు


నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేసి ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోకు భూములిచ్చిన దళిత కార్మికుల పొట్టకొట్టవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు కోరారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో మరో మద్యం డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరుతూ మంగళవారం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో కార్మికులు, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కొత్తగా టెక్కలిలో మరో డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి నీరు అడుగుతున్నారు తప్ప బీరు అడగడం లేదని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో హమాలీ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు, నాయకులు టి.రామారావు, ఎస్.సురేష్, ఎస్.రమణ, బోనెల.రాము, పి.రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ.రాజు, కె.వి రమణ, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాఫ్ట్ టెన్నిస్ పోటీలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

పాతపట్నం: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17, అండర్–19 బాల, బాలికల సాఫ్ట్ టెన్నిస్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు పాతపట్నం మండలం సూర్యనారాయణపురం గ్రామ సమీపంలోని అక్షర పాఠశాల మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 270 మంది విద్యార్థులు హాజరయ్యారని రాష్ట్ర వ్యాయామ సంఘం అధ్యక్షుడు ఎన్ని శేఖర్‌బాబు తెలిపారు. కొందరు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ తిరుపతిరావు, డైరెక్టర్ రియాజ్, ప్రిన్సిపాల్ సుజాత, పీఈటీలు కె.రాజారావు, జె.కృష్ణ, ఎస్.కృష్ణారావు, లోకేశ్వరరావు, డి.లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పీజీ ఫలితాల్లో మెరిసిన విశాల్



నందిగాం: దేవళభద్ర పంచాయతీ జల్లపల్లికి చెందిన ఆరంగి విశాల్ నీట్ పీజీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో ఓబీసీ కేటగిరీలో 5136వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 296వ ర్యాంకు సాధించాడు. విశాల్ తండ్రి జానకిరామయ్య బ్యాంకు అధికారి కాగా, తల్లి సరిత గృహిణి. విశాల్ ఎంబీబీఎస్ శ్రీకాకుళం రిమ్స్‌లో పూర్తి చేశాడు. మారుమూల గ్రామానికి చెందిన విశాల్ పీజీలో ఉత్తమ ర్యాంకు సాధించడం తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బాలుడు అదృశ్యం


గజపతి సందీప్

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌కు చెందిన గజపతి సందీప్ (14) అనే బాలుడు అదృశ్యమైనట్లు మేనత్త కొర్రాయి సుజాత కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. పాఠశాలకు సరిగా వెళ్లకపోవడంతో మందలించామని, ఆ తర్వాత ఈ నెల 14న ఒడిశా రాష్ట్రంలోని తమ స్వగ్రామమైన గజపతి జిల్లా ఒతిసింపూర్ వెళ్లిపోతానని చెప్పి వెళ్లిపోయాడని, అక్కడికి కూడా వెళ్లలేదని తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

రణస్థలం: 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి, దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా సభ్యత్వ అభియాన్‌లో భాగంగా మంగళవారం రణస్థలం మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలన్నారు. జిల్లా పూర్వ అధ్యక్షుడు జి.వెంకటగిరి మాట్లాడుతూ కాంప్లెక్స్ స్థానాల్లో పని చేస్తున్న గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులకు, శాశ్వత స్థానాలు కేటాయించే ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి రవి భట్టు మాట్లాడుతూ జూన్‌లో బదిలీలు పొంది రిలీవర్ లేని కారణంగా అదే స్థానాల్లో ఉన్న ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించేలా తాజా డీఎస్సీ అభ్యర్థులను నియమించాలన్నారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు జి.చిన్ని కృష్ణంనాయుడు, ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

21న నవయువ కవితా మహోత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, విశ్వసాహితీ కళావేదిక, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 21న శ్రీకాకుళం నవ యువ కవితా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఈవేమన, జంధ్యాల శరత్ బాబు, భమిడిపాటి గౌరీశంకర్ తెలిపారు. మునసబుపేటలోని గురజాడ విద్యా సంస్థల ఆవరణలో మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఉదయం 9 గంటలకు ఉత్సవం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులు గజల్ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.రజిని, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, గురజాడ సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, విశ్వసాహితీ కళావేదిక అధినేత కొల్లి రమావతి పాల్గొంటారని వివరించారు.

థర్మల్ పవర్ ప్లాంట్‌పై కావాలనే రభస


మాట్లాడుతున్న కూన రవికుమార్

బూర్జ: నియోజకవర్గం అభివృద్ధికి సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ తెస్తే కొందరు కావాలనే రభస చేస్తున్నారని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ నిర్మాణం చేపడతారో తెలియక ఆదివాసీలను రెచ్చ గొట్టి ప్రతి రోజు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి సర్వే కూడా చేయకుండా అడ్డుకుంటున్నారు చెప్పారు. పవర్ ప్లాంట్‌తో సుమారు 10 వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. అనంతరం విద్యాశాఖపై సమీక్షిస్తూ.. మండల ఎంఈఓలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం లేదని, ఎంఈఓ శ్యామసుందరరావు సమావేశానికి డుమ్మా కొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో అందజేయాలన్నారు. ఎంఈఓల నిర్వాహకం వల్లే అల్లేన గ్రామంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జీవోకు విరుద్ధంగా 14 కి.మీ దూరంలో ఉన్న పాలవలస పాఠశాలలో విలీనం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంఈఓలు సెలవులపై వెళ్లాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు, తహసీల్దార్ వై.వి.పద్మావతి, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, వైస్ ఎంపీపీలు కరణం కృష్ణమూర్తి నాయుడు, బుడుమూరు సూర్యారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది శ్రీరామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ వద్దు.. పర్యావరణం ముద్దు


తిమడాంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ ప్రతినిధులు

బూర్జ: పవర్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా బహిరంగ సభను విజయవంతం చేయాలని పోరాట కమిటీ సమన్వయకర్త యోబ యోగి, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్ దొర ఆదివాసీలకు పిలుపునిచ్చారు. మంగళవారం పోరాట కమిటీ సభ్యులు పిలుపు మేరకు తిమడాం గ్రామంలో సమావేశం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న అడ్డూరిపేటలో జరిగే బహిరంగ సభకు అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

- అందని ద్రాక్షలా బీసీ రుణాలు
- నిరుద్యోగ యువతకు తప్పని నిరాశ
- అమలుకు నోచుకోని బీసీ మహిళల సాయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వెనుకబడిన తరగతులకు సబ్సిడీపై అందించే బీసీ కార్పొరేషన్ రుణాలు అందని ద్రాక్షలా మారాయి. బీసీల చెందిన విద్యావంతులైన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన బీసీ సబ్సిడీ రుణాలు, మహిళలకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చినా హామీలు అమలు కాకపోవడంతో ఆశావహులకు ఎదురుచూపులే మిగులుతున్నాయి. యువతకు రుణాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం తొలి ఏడాది పూర్తిగా మొండిచెయ్యి చూపింది. రెండో సంవత్సరం బీసీ రుణాలకు నోటిఫికేషన్ విడుదల చేసి ఇంటర్వ్యూలు నిర్వహించినా చివరి క్షణంలో నిలిపివేశారు. దీంతో రెండేళ్ల పాటు ఏ పథకం, ఏ ప్రయోజనం అందక బీసీ యువత, మహిళలకు నిరాశ చెందుతున్నారు.

రూ.20వేల హామీ..నెరవేరదేమీ?

వైఎస్సార్ చేయూతకు దీటుగా ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ కులాలకు చెందిన మహిళలకు ఏటా ప్రోత్సాహంగా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఆర్భాటంగా ప్రకటించారు. తర్వాత ఆ సంగతే మర్చిపోయారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన మహిళలకు ఏటా రూ.18,750 తంభన్‌గా అందించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా 45 నుంచి 60 ఏళ్ల మహిళలకు ఇస్తామన్న రూ.20 వేలుకు అతీగతి లేదు. ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారని మంత్రుల వద్ద ప్రస్తావిస్తే ఆర్థిక పరిస్థితి బాగా లేదని, రాష్ట్రాన్ని అమ్మి ఇవ్వాలంటూ దాటవేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో..

వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వరుసగా నాలుగేళ్ల పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా నాలుగు విడతలుగా సాయం అందించారు. ప్రతి మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారు. దీంతో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేశారు. మొదటి విడతగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 38 మండలాల్లో 1,91,417 మంది మహిళలకు రూ.358.90 కోట్లు అందజేశారు. రెండో విడతలో 38 మండలాలకు గాను 1,97,997 మందికి రూ. 371.24కోట్లు, మూడో విడతలో విభజన జిల్లాలోని 30 మండలాల్లో 1,69,767 మందికి రూ.31831.31కోట్లు, నాలుగో విడతలో 1,88,033 మంది లబ్ధి పొందారు.

నిరుద్యోగులకు దగా..

జిల్లాలో బీసీ సామాజికవర్గాల వారే అధికం. ఆ వర్గానికి ఆర్థిక వనరులు అంతంత మాత్రంగానే ఉండటంతో నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీసీ రుణాలు ఎక్కువ స్థాయిలో మంజూరు చేస్తే స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక 3133 యూనిట్లకు మాత్రమే నోటిఫికేషన్ వేశారు. దీనికి పలు ఆంక్షలు పెట్టారు. అయినా రుణాలు ఇవ్వలేదు. మొత్తానికి బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ వర్గాలకు ఎటువంటి ప్రయోజనం చేకూరకపోవడంతో నిరుద్యోగులు, మహిళలు ఆందోళన చెందుతున్నారు.